క్లుప్తంగా

ఎండుతున్న వేపచెట్లు



మోమిన్‌పేట: ఆయుర్వేదంలో సర్వరోగ నివారిణిగా చెప్పుకునే వేపచెట్లు వింత వ్యాధుల బారిన పడి ఎండిపోతున్నాయి. రెండు సంవత్సరాల నుంచి చిగుర్లు, లేత కొమ్మలు కుళ్లిపోతుండడం సగటు జీవిని కలవరపెడుతోంది. తీవ్రత ఎక్కువై ముదురు చెట్లు కూడా కొద్ది రోజుల్లోనే చనిపోతున్నాయి. ఇలాగే కొనసాగితే రానున్న వేసవిలో చల్లని నీడతోపాటు వీచే గాలికీ గడ్డుకాలం ఏర్పడే ప్రమాదం లేకపోలేదని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేప మహావృక్షాల పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న యువకుడు



బాధితునికి ఫోన్ అందజేస్తున్న దస్తయ్య

పరిగి: దోమ మండల పరిధిలోని పాలేపల్లి గ్రామానికి చెందిన జోగు దస్తయ్యకు పరిగి పట్టణ కేంద్రంలో ఆదివారం మొబైల్ దొరికింది. దీంతో ఆ యువకుడు పోలీసులను సంప్రదించి.. మొబైల్‌ను అప్పగించారు. వారి సహాయంతో ఫోన్‌ను బాధితునికి అందజేశారు. మార్కెట్లో దొరికిన వస్తువును తిరిగి ఇవ్వడంపై పలువురు ప్రశంసించారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం
ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

బొంరాస్‌పేట్: గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బురాన్‌పూర్ గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, ఈద్గానిర్మాణ తదితర అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, శంకుస్థాపన చేసి మాట్లాడారు. పల్లెప్రగతిలో భాగంగా గ్రామాల అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక నిధులు కేటాయిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హెమిబాయి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచు లక్ష్మి, నాయకులు యాదగిరి, చాంద్‌పాష తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ద్వాదశ జ్యోతిర్లింగ పూజ

కొడంగల్ రూరల్: శివస్వాములు, గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగ(మెట్ల) పడి పూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. చంద్రశేఖర్ స్వామి ఆధ్వర్యంలో సంకల్పం, గణపతి పూజ, శివలింగానికి పంచామృతంతో రుద్రాభిషేకం, శివార్చన, శివాష్టకం, లింగాష్టకం, పంచాక్షరి స్తోత్రం, ధూపదీప నైవేద్యాలను దేవ దేవునికి సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు. అనంతరం శివనామస్మరణతో భక్తిపారవశ్యంగా శివ మాలధారులు ఘనంగా పూజలు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బంట్వారం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన షేక్ ముఫీద్ పాష (31) కుటుంబాన్ని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. పాష సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇంటలిజెన్సి కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే వాడు. గత నెల 30న ద్విచక్ర వాహనంపై విధులకు వెళ్తుండగా లింగంపల్లిలో ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో పాష ఘటనా స్థలంలోనే చనిపోయాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ.. నూరుల్లాపూర్‌కు వెళ్లి పాష కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట పలువురు సర్పంచులు బల్వంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బర్కత్‌పల్లి నర్సింహులు, యాచారం ఎంపీటీసీ ప్రశాంతి శరణారెడ్డి, మాజీ సర్పంచ్ షబ్బీర్, నాయకులు వెంకటయ్య, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరుల ఉన్నారు.

వేడుకగా మల్లన్న జాతర



జాతరలో పాల్గొన్న నాయకుడు శుభప్రద్‌పటేల్ తదితరులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని మహాలింగపురంలో మల్లికార్జునస్వామి (మల్లన్న)జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ మల్లన్న జాతరకు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. వేడుకల్లో బీఆర్‌ఎస్‌వీ అధికార ప్రతినిధి కోమటిరెడ్డి లక్ష్మీనరసింహ్మారెడ్డి, జెడ్పీటీసీ గోవిందమ్మ గోపాల్ రెడ్డి, సర్పంచ్ మాణిక్‌రెడ్డి, ఎంపీటీసీ భవాని యాదగిరి, నాయకులు రాఘవేందర్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ సేవలకు మంగళం!

- ప్రైవేట్ నెట్ వర్క్‌లోకి ప్రభుత్వ శాఖలు
- పోలీసు అధికారులకు కొత్త నంబర్లు

తాండూరు: భారత్ సంచార్ నిఘమ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) ఫోన్‌లు ఉపయోగిస్తే ఒకప్పుడు బ్రాండ్‌గా నిలిచేది. ఆ నెట్‌వర్క్ సేవల కోసం పోటీపడి వరుసలో నిలిచి కనెక్షన్‌లు తీసుకున్న రోజులు ఉన్నాయి. అయితే ఇటీవల కాలంలో బీఎస్ఎన్ఎల్ సేవలు కనుమరుగవుతున్నాయి. నెట్‌వర్క్ వ్యవస్థలన్నీ పూర్తిగా కార్పొరేట్ సంస్థల హస్తగతం కావడంతో ప్రభుత్వం రంగమైన బీఎస్ఎన్ఎల్ కుదేలైంది. దశాబ్దాలుగా టెలిగ్రామ్ నుంచి మొదలుకొని టెలిఫోన్, సెల్‌ఫోన్‌ల వరకు నెట్‌వర్క్ సేవలను అందించిన బీఎస్ఎన్ఎల్‌ను కొంత కాలంగా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుండడంతో నెట్‌వర్క్ వ్యవస్థ కుప్పకూలినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ వినియోగిస్తున్న వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లలోకి బదిలీ చేసుకొంటున్నారు. అదే బాటలో ప్రభుత్వ శాఖలు సైతం ప్రైవేటు నెట్‌వర్క్‌లోకి మారుతున్నాయి.

బీఎస్ఎన్ఎల్ నుంచి..

సెల్‌ఫోన్ వినియోగం నాటి నుంచి ప్రభుత్వాలు బీఎస్ఎన్ఎల్ సేవలను వినియోగిస్తున్నాయి. అయితే టెలిఫోన్ రంగంలో ప్రైవేటు సంస్థలు దూకుడు పెంచడంతో.. క్రమంగా బీఎస్ఎన్ఎల్‌పై ప్రభావం పడింది. ఒక్కో ప్రభుత్వ శాఖ దూరమవుతోంది. తాజాగా పోలీసు శాఖలో అధికారులకు అందించిన సెల్‌ఫోన్ నంబర్లు బీఎస్ఎన్ఎల్ నుంచి ఎయిర్‌టెల్‌లోకి మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగా వికారాబాద్ జిల్లా పోలీసు అధికారులకు ఉన్న బీఎస్ఎన్ఎల్ ఫోన్ నంబర్లు మారాయి. ఎస్పీతో పాటు డీఎస్పీ, సీఐ, ఎస్ఐలకు కొత్త నంబర్లు వచ్చాయి. తాండూరు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న డీఎస్పీ, సీఐ, ఎస్ఐలకు కొత్త నంబర్లను కేటాయించారు. ఆయా ఠాణాల పరిధిలోని ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పోలీసు అధికారులు కొత్త నంబర్లను ప్రజలకు తెలిసే విధంగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

కొత్త నంబర్లను సంప్రదించాలి: ఎస్పీ



అనంతగిరి: జిల్లాలో ఎస్పీతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారుల ఫోన్ నంబర్లు మారాయని ఎస్పీ కోటిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాత నంబర్ల స్థానంలో కొత్తగా కేటాయించిన నంబర్లను సంప్రదించాలని ఈ సందర్భంగా వెల్లడించారు.

తాండూరు సబ్ డివిజన్ పరిధిలోని ఫోన్ నంబర్లు

స్టేషన్	కొత్త నంబర్
తాండూరు పట్టణ సీఐ	871 2670 049
తాండూరు పట్టణ ఎస్ఐ	871 2670 050
తాండూరు రూరల్ సీఐ	871 2670 051
కరన్‌కోట్ ఎస్‌హెచ్‌ఓ	871 2670 052
ఎస్‌హెచ్‌ఓ పెద్దేముల్	871 2670 053
ఎస్‌హెచ్‌ఓ యాలాల	871 2670 054
ఎస్‌హెచ్‌ఓ బషీరాబాద్	871 2670 055

వైభవంగా మాణిక్యప్రభు జాతర



స్వామి వారి ఊరేగింపులో భక్తులు

పరిగి: మిట్టకోడూర్‌లో మాణిక్యప్రభు జాతర ఆదివారం వైభవోపేతంగా జరిగింది. భక్తులు భజనలు, కోలాటాలతో స్వామి వారిని పురవీధుల గుండా ఊరేగించగా.. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉట్టికొట్టే కార్యక్రమంలో యువత పాల్గొని సందడి చేశారు. అనంతరం వీధినాటకాన్ని ప్రదర్శించారు.

కుట్రదారులపై చర్యలు తీసుకోవాలి



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

యాలాల: దళిత యువకులు నరేష్, ప్రేమ్‌కుమార్‌పై జరిగిన దాడికి కారణమైన కుట్రదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం దేవనూరులో మానవ హక్కుల వేదిక ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు బాలరాజు, అమర్ మాట్లాడారు. జనవరిలో జరిగిన ఘర్షణను మత తత్వ సంస్థలు, రాజకీయ నాయకులు చొరబడి అమాయకులపై దాడి చేసేలా రెచ్చగొట్టారని, ఇద్దరు యువకుల మధ్య జరిగిన తోపులాటను ఒక వర్గంపై జరిగిన దాడిగా వక్రీకరించి మూక దాడులు జరిగేలా ప్రేరేపించారని ఆరోపించారు. మతోన్మాద ప్రేరణతో దళిత వర్గానికి చెందిన ఇద్దరు యువకులపై దాడి చేయించి హత్యాయత్నానికి కారకులైన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కృష్ణ ధర్మరక్షణ పేరిట దుర్గారావు అనే వ్యక్తి బలహీన వర్గాలపై దాడులకు ప్రేరేపిస్తున్నారని ఆరోపిస్తూ ఎస్ఐ అరవింద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ప్రతినిధులు దిలీప్, అతిష్, హనుమాన్, రోహిత్, సురేష్, అచ్యుతాకుమార్, కుమార్, మహేందర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

‘జిల్లా పరిషత్ పరిధిలోనే కొనసాగించాలి’



చైర్‌పర్సన్ సునీతారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్, ఉపాధ్యాయులు

తాండూరు: జిల్లా పరిషత్ ఆధీనంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను.. ప్రభుత్వ పాఠశాలల్లోకి విలీనం చేయొద్దంటూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డికి ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఆదివారం పట్టణంలో పర్యటించిన చైర్‌పర్సన్‌ను మాజీ కౌన్సిలర్ జుబేర్ లాల, ఉపాధ్యాయులు కలిశారు. మండల పరిషత్ పరిధిలో ఉన్న పాఠశాలలను ప్రభుత్వ బడుల ఆధీనంలోకి వెళితే తాము నష్టపోతామంటూ చైర్‌పర్సన్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై చైర్‌పర్సన్ సానుకూలంగా స్పందించారు. త్వరలో ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని వారికి చెప్పారు.

పేదల వైద్యానికి ప్రైజ్‌మనీ అందజేత

జట్టు నిర్ణయాన్ని అభినందించిన గ్రామస్తులు



ప్రైజ్‌మనీని బాధితుడికి అందజేస్తున్న జట్టు సభ్యులు

చేవెళ్ల: క్రికెట్ టోర్నమెంట్‌లో గెలిచిన ప్రైజ్‌మనీని గ్రామంలోని పేద ప్రజల వైద్యానికి అందించి ఆలూరు జట్టు సభ్యులు వారి మానవత్వాన్ని చాటుకున్నారు. వారి ఉదార స్వభావాన్ని మండల నాయకులు, ప్రజలు అభినందించారు. ఆదివారం గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన తలారి చిట్టయ్య(కృష్ణ)కు రెండు కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో అతనికి ప్రైజ్‌మనీని అందజేశారు. చేవెళ్ల మండలంలో నెలరోజుల పాటు జరిగిన పైండ్ల గోపాల్‌రెడ్డి క్రికెట్ టోర్నమెంట్‌లో శనివారం ఆలూరు, ఇబ్రహీంపల్లి జట్లు తలపడగా ఆలూరు అంబేడ్కర్ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో టోర్నీ నిర్వాహకులు ప్రకటించిన నగదును, షీల్డ్‌ను అందుకున్నారు. అంబేడ్కర్ జట్టు సభ్యులు అంతా కలిసి తాము సంపాదించిన ప్రైజ్‌మనీని గ్రామంలోని పేదల వైద్య ఖర్చులకోసం కేటాయించాలని నిర్ణయించుకున్నారు. నిర్ణయించుకోవటమే కాదు వెంటనే గ్రామంలోని పేద కుటుంబానికి చెందిన చిట్టయ్యకు జట్టు సభ్యులు రూ.20 వేల నగదును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ జట్టు కెప్టెన్ రాజు మాట్లాడుతూ.. తమ విజయానికి గ్రామస్తుల ప్రోత్సాహం ఉందని, అందుకే తమకు వచ్చిన పేరు ప్రఖ్యాతులు గ్రామానికి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు అశోక్, అంబేడ్కర్ యూత్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

తీరిన తాగునీటి సమస్య

కొందుర్గు: మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోవడంతో వారం రోజులుగా కొందుర్గు మండలం ముట్పూర్ గ్రామపంచాయతీ చుక్కమెట్టు గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడింది. గ్రామంలో చెడిపోయిన బోరుమోటార్‌ను బాగుచేయించి తమ దాహార్తిని తీర్చాలని సర్పంచ్ నర్సింహారెడ్డిని గ్రామస్తులు కోరినప్పటికీ స్పందించలేదు. గ్రామానికి చెందిన శేఖర్ అనే యువకుడు సర్పంచ్‌కు ఫోన్‌చేయగా.. సర్పంచ్ ఆ యువకుడిని దుర్భాషలాడాడని, ఇందుకు సంబంధించిన ఆడియో సంభాషణను శేఖర్ సోషల్ మీడియాలో వైరల్ చేయగా స్పందించిన సర్పంచు.. శనివారం రాత్రికి రాత్రే సమస్యను పరిష్కరించారు. ప్రస్తుతం చుక్కమెట్టు ప్రజలు సింగిల్‌ఫేజ్ మోటార్ ద్వారా నీళ్ల తాగుతున్నారు. దీంతో గ్రామస్తులు తమకు తాగునీటి సమస్య తీరిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

దోమ: గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని సర్పంచ్ రాజిరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఏడో వార్డులో సీసీరోడ్డు పనులు ప్రారంభించిన అనంతరం సర్పంచ్ మాట్లాడారు. గ్రామస్తులు గ్రామాభివృద్ధికి సహకరించాలని, ప్రతి వార్డులో సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ పనులతో పాటు వివిధ రకాల సంక్షేమ పనులు వేగవంతంగా పూర్తి చేయిస్తున్నామని చెప్పారు. తమ వంతుగా ప్రజలు సహకరించి వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ మహిళా సభ్యురాలు సంతోష, మాజీ ఎంపీపీ రాజగోపాల చారి, గ్రామస్తులు నరేందర్‌రెడ్డి, ఆనందం, చంద్రకాంత్ రావు, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

దోమ: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలని సర్పంచ్ కల్పన అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గంజిపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న శివలింగ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అర్చకులతో వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఊరేగింపు, హోమగుండంతో పాటు లింగప్రతిష్ఠత అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గాలను అనుసరిస్తూ ముందుకు సాగితే మానసిక ప్రశాంతత నెలకొంటుందని తెలిపారు. కార్యక్రమంలో చేగుటి రాజు, బ్రహ్మయ్య, శ్రీనివాస్, జైపాల్, రవి, శ్రీనివాస్, నేతలు రాంసింగ్, కిసాన్‌సింగ్, వెంకట్‌రాములు, షాదుల, దశరథ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దోచుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
బీజేపీ నాయకుడు చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో పన్నుల పేరుతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని దోచుకుంటుందని బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ ఆరోపించారు. కొత్తూరు మండలం పెంజర్ల గామానికి చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి చంద్రశేఖర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ అబద్దాల పోకడ నేటికీ కొనసాగుతుందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని, బంగారు తెలంగాణగా చేస్తానని చెప్పిన సీఎం.. బాధల తెలంగాణగా మారుస్తున్నాని మండిపడ్డారు. చెప్పారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా దోచుకుంటున్న ఏకైక సీఎం కేసీఆర్ అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఆ నమ్మకంతోనే స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు.

బాల సాహిత్యంలో ‘ఆణిముత్యం’



మణిపూసలపై ప్రసంగిస్తున్న కవి నాగరాజు

బషీరాబాద్: మండలంలోని కంసాన్‌పల్లి(ఎం) గ్రామానికి చెందిన బాలకవి బోయిని నాగరాజుకు అరుదైన అవకాశం దక్కింది. రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సార్వత పరిషత్తులో నాగరాజు పాల్గొని తన సృజనానుభవాలు వెల్లడించారు. బాల ప్రతిభావంతులు సృజనానుభవాలు అనే అంశాలపై అనర్గలంగా ఉపన్యసించారు. తన గురువు వడిచర్ల సత్యం రచించిన మణిపూసల కవితా ప్రక్రియ పుస్తకాల గురించి విపులంగా వివరించి.. సాహితీ వేత్తలను ఆకట్టుకున్నారు. చదువుకునే సమయంలోనే ‘మణిపూసల హారం, ‘అక్షర మణులు’ అనే రెండు పుస్తకాలు రాసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కవి నాగరాజును నిర్వాహకులు సన్మానించి, ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ బాల సాహితీ వేత్తలు ఉండ్రాళ్ళ రాజేశం, పైడి మర్రి రామకృష్ణ, తిరునగరి వేదాంత సూరి, చైతన్య భారతి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునుడి చెంతకు పాదయాత్రగా..



శ్రీశైలం బయలుదేరిన శివమాలధారులు

యాలాల: పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మల్లికార్జునుడి చెంతకు యాలల మండలం ముద్దాయిపేట నుంచి ఆదివారం శివమాలధారులు పాదయాత్రగా బయలుదేరారు. శివాలయంలో పూజలు చేసిన అనంతరం ఇరుముడులతో 10 మంది భక్తులు వెళ్లేందుకు సిద్ధమవగా.. కుటుంబీకులు, సన్నిహితులు వారిని సాగనంపారు. పాదయాత్రగా వెళ్లిన వారిలో రాజుగౌడ్, మురళీగౌడ్, లక్ష్మణ్‌యాదవ్, అంజిలయ్య, అంజి, రవిగౌడ్, రమేష్ యాదవ్, శివ, అరుణ్, శంకర్, పరమేశ్వర్ ఉన్నారు.

ధారూరులో..

ధారూరు: మండల కేంద్రానికి చెందిన శివ భక్తులు శ్రీశైలం శైవ క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ముందుగా స్థానిక వీరభద్రేశ్వర స్వామి దేవాలయంలో ప్రథమ పూజ్యుడు మహాగణపతికి, కపిలేశ్వరస్వామి, పార్వతీమాత, సుబ్రమణ్యేశ్వర స్వామి, వీరభద్రేశ్వరస్వామి, నాగదేవత, నందీశ్వర స్వామి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత మహాపడి పూజ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేయగా.. ఆలయ పూజారి చెన్నబసవయ్య స్వామి భక్తులకు హారతి ఇచ్చి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి బైపాస్ రహదారి సమీపంలో గల ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్(ఎఫ్‌సీఎన్)అనాథాశ్రమంలో గ్రామీణ పేద యువతులకు కుట్టులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎఫ్‌సీఎన్ ప్రతినిధి శ్రీను ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణ ఈ నెల 13నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. అనివార్య కారణాల వల్ల చదువు మధ్యలోనే మానేసి, వివాహం కాని యువతులకు కుట్టు, ఎంబ్రాయిడరీలో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉచిత భోజన వసతిని కల్పించి ఎఫ్‌సీఎన్ సంస్థ పర్యవేక్షణలో శిక్షణ కేంద్రాన్ని నిర్వహించడం జరుగు తుందని వెల్లడించారు. యువతులు 18నుంచి 22సంవత్సరాల వయసు కలిగి ఉండాలని, శిక్షణ కాలం మూడు నెలలు మాత్రమే ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కాలంలో వ్యక్తిత్వ వికాసం, కుటుంబ జీవన విధానం వంటి జీవన నైపుణ్యాలను నేర్పించడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు ఉచితంగా కుట్టు మిషన్‌లను అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఆసక్తి కలిగిన యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్‌ఇన్‌నీడ్ సంస్థను సంప్రదించాలని కోరారు.



ఉట్టి కొడుతున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో పెరుగుబసంతం



అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు

కొడంగల్ : పట్టణ శివారులోని బండల ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం సాయంత్రం పెరుగు బసంతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి పల్లకీ సేవ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసిన తర్వాత పెరుగు బసంతం కార్యక్రమంలో భాగంగా ఉట్టి కొట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ మధుయాదవ్, బాకారం అరుణ్‌కుమార్, నరేష్‌గౌడ్ తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక యోధుడు రవిదాస్



దోమ: రవిదాస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నేతలు

దోమ: శతాబ్దాల క్రితం భక్తి ఉద్యమాన్ని కొత్త పుంతలు తొక్కించిన ఆధ్యాత్మిక యోధుడు సంత్ రవిదాస్ అని బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. రవిదాస్ పేదరికంలో చర్మకార వృత్తిని నిర్వహిస్తూ.. ఆధ్యాత్మిక గురువుగా, మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల దళిత మోర్చా అధ్యక్షుడు నర్సింహులు, ఐనాపూర్ ఉపసర్పంచ్ బుగ్గయ్య, మండల ప్రధానకార్యదర్శి బొంగు మల్లేశం, బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి మహేశ్, బీజేపీ నేతలు కృష్ణయ్య, ఎల్లయ్య, హన్మంతు, రామలింగం, వెంకటయ్య, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

అంటరానితనం నిర్మూలనకు..



పరిగిలో..

పరిగి: ఒక పక్క మొఘల్‌ల దండయాత్ర, మరో పక్క అంటరానితనం పేరుతో దేశమంతా కకావికలం అవుతున్న రోజుల్లో.. అంటరానితనాన్ని రూపుమాపడానికి సంత్ రవిదాస్ మహారాజ్ ఎంతో కృషి చేశారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచందర్ అన్నారు. రవిదాస్ జయంతి సందర్భంగా కమలనాథులు.. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించి మాట్లాడారు. తన కీర్తనల ద్వారా అట్టడుగు వర్గాల ప్రజల హృదయాల్లో భక్తిని రగిల్చిన మహనీయుడు రవిదాసని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు మిట్టపరమేశ్వర్‌రెడ్డి, దళితమోర్చా మండల అధ్యక్షుడు గంగాపురి, నాయకులు పెంటయ్య, నర్సింహులు, ఆంజనేయులు, శ్రీశైలం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.